
# నీ చావు నువ్వు చావు !

ఏ దేశ మేగినా ఎందు కాలిడినా పొగడరా నీ తల్లి భూమి భారతిని....

రత్నగర్భ మన భారతదేశమని రాగరంజితంగా బృందగానం చేద్దాం.



భారత సంస్కృతి అతి ప్రాచీనమైనదనీ, భిన్నత్వంలో ఏకత్వం మన ప్రత్యేకతనీ ఒళ్లు మరచి కళ్లు మూసుకుందాం.

పరమత సహనానికి మనదేశం మారుపేరని చెయ్యెత్తి జైకొడదాం.

బ్రిటిష్ దాస్య శృంఖలాల నుంచి మహాత్మాగాంధీ మనకు విముక్తి కలిగించాడని శిరమెత్తి సగర్వంగా చాటుదాం.

ఝాన్సీ లక్ష్మీబాయి గుర్రమెక్కి, చేత కత్తి పట్టి తెల్లదొరల సైన్యాన్ని మట్టుపెట్టిన వీర వనిత అని ఒళ్లు పులకరించేలా చెప్పుకుందాం.

సుభాష్‌చంద్రబోస్, చంద్రశేఖర్ ఆజాద్, అల్లూరి సీతారామరాజు విప్లవ జ్యోతులని రోమాలు నిక్కబొడిచేలా భుజాలు చరుచుకుందాం.

అన్నపూర్ణ మన ఆంధ్రప్రదేశ్ అని గొప్పలుపోదాం.

పల్లెసీమలే మన భాగ్యసీమలని ఎలుగెత్తి చాటుదాం.

రైతే రాజని ములగ చెట్టెక్కి మురిసిపోదాం.

కార్మికుడే ప్రగతికి కారకుడని వేదికలెక్కి ఉపన్యాసాలు దంచుదాం.

మన తొలి ప్రధాని పండిట్ జవహర్‌లాల్ నెహ్రూ నిజమైన సోషలిస్టనీ సామ్యవాదం కోసం పాటుపడ్డాడనీ మన పిల్లలకు పాఠాలు చెబుదాం.

తెలంగాణా పోరాట వీరుల్ని పేరు పేరునా స్మరిస్తూ లాల్ సలాం చేద్దాం..

పొట్టివాడైనా గట్టివాడు మన లాల్‌బహదూర్ శాస్త్రి అని గట్టిగా చెప్పుకుందాం. జై జవాన్, జై కిసాన్ అనే ఆయన నినాదాన్ని తిరిగి నినదిద్దాం.

ఇందిరే ఇండియా, ఇండియానే ఇందిర అనే ఒకనాటి నినాదాన్ని గుర్తుకు తెచ్చుకుని ఉప్పొంగిపోదాం.

గరీబీ హటావో అనే ఆమె నినాదాన్ని తలచుకుని గర్వపడిపోదాం.

కాంగ్రెస్ పాలనకు మొదటిసారిగా బ్రేకు వేసిన జనతాపార్టీ మురార్జీ ప్రధానిగా అధికారంలో కొచ్చిందనే జ్ఞాపకంతో సంతోషపడిపోదాం.

ఆయన నాయకత్వంలో విదేశాంగమంత్రిగా వాజపేయి సమర్థంగా వ్యవహరించాడని ప్రచురించిన వ్యాసాలను మననం చేసుకుందాం.

కార్మిక నాయకుడిగా ఎమర్జన్సీ రోజుల్లో జైల్లో ఉంటూ పోటీచేసి, మంచి మెజార్టీతో ఎంపీగా నెగ్గిన జార్జి ఫెర్నాండెజ్‌ను మెచ్చుకుందాం.

కార్గిల్ యుద్ధంలో పాకిస్థాన్‌ను గడగడలాడించిన భారత్ వీరోచిత చర్యను వేనోళ్ల పొగుడుకుందాం.

అరవై ఏళ్ల వయసులో లక్షల రూపాయల ఆదాయాన్ని వదులుకుని సినీరంగం నుంచి రాజకీయ రంగంలోకి వచ్చి, తెలుగుదేశం పార్టీని పెట్టి, స్వల్పకాలంలోనే రాష్ట్రంలో అపార మెజార్టీతో అధికారంలోకొచ్చిన ఎన్టీ రామారావు ముఖారవిందాన్ని కళ్లముందు నిలుపుకుని వెలిగిపోదాం.

తాము ఎవరికైతే ఉద్దేశించి నిధులు విడుదల చేస్తామో, అవి వారికి ఇరవై శాతం అందినా, దేశం ఎంతో అభివృద్ధి చెందుతుందంటూ పరోక్షంగా నాయకుల అవినీతి ఏ స్థాయిలో ఉందో బాహాటంగా చెప్పిన నాటి ప్రధాని రాజీవ్‌ను ప్రశంసిద్దాం.

అధికారం నుంచి నందమూరిని తప్పించి తనే సి.ఎం. అయి హైటెక్ పాలన ప్రారంభించిన నారా చంద్రబాబునాయుడి రాజకీయ ఎత్తుగడలను భళారే బల్ బలే అని పాడుకుందాం.

అప్పటి అమెరికా అధ్యక్షుడు బిల్ క్లింటన్‌ను హైదరాబాద్‌కు రప్పించినందుకు ఆయనకు సాటి ఆయనే అందాం.

మరి అంతగా పొగిడినా ఈ నోటితోనే-

భారత్-చైనా యుద్ధం జరుగుతున్నప్పుడు కృష్ణమాచారి మాట వినకుండా మనం ఓడిపోయేలా చేసిన నెహ్రూ అమాత్యుడి గురించీ........

తన ప్రధాని పదవిని నిలుపుకోడానికి ఎమర్జన్సీని విధించి అనేక అరాచకాలకూ, అక్రమాలకూ కారకురాలైన ఇందిరమ్మ గురించీ....

వృద్ధులకూ, పిల్లలకూ కూడా కుటుంబ నియంత్రణలు చేయించిన ఆమె కుమారుడు సంజయ్‌గాంధీ గురించీ.....

తెలంగాణా పోరాటంలో వీరోచితంగా పోరాడి, ఎమర్జన్సీలో కాంగ్రెస్ తోకలా వ్యవహరించిన సిపిఐ గురించీ ....

భారతీయులు తమ మూత్రాన్ని తామే తాగుతారనే అపప్రథను అంతర్జాతీయంగా తెచ్చిపెట్టిన మురార్జీ గురించీ....

ఒకవైపు కార్గిల్ విజయాట్టహాసం చేస్తూనే మరోవైపు అధికారం నిలుపుకోవడం కోసం జయలలితనూ, మమతా బెనర్జీనీ మచ్చిక చేసుకోడం కోసం వారికి సైసై అన్న వాజ్‌పేయి గురించీ....

'పనిచేసే ప్రభుత్వం' వచ్చేక రాష్ట్రంలో జరిగిన పత్తి రైతుల ఆత్మహత్యల గురించీ....

'మాకు న్యాయం కావాలి' అంటూ చలో అసెంబ్లీకి బయల్దేరిన రైతు సోదరులను బషీర్‌బాగ్ వద్దే అడ్డి, చితక్కొట్టడమేగాక, తుపాకీ గుళ్ల వర్షం కురిపించిన ప్రభుత్వ రక్షకభట దౌష్ట్యం గురించీ...

చేనేత కార్మికులు ప్రభుత్వ చేయూత లేక మృత్యువాత పడ్డం గురించీ...

మొన్నటికి మొన్న, కరీంనగర్ జిల్లా సిరిసిల్ల పట్నంలో ఆకలీ అవమాన బాధలు భరించలేక ఓ కుటుంబం ఆత్మహత్య చేసుకోడం గురించీ.....

ఒక్క సిరిసిల్లలోనే గత సంవత్సరం జనవరి నుంచి ఈ ఏడాది మార్చి వరకూ, అంటే పదిహేను నెలల కాలంలో ముప్పై నాలుగుమంది చేనేత కార్మికులు కిరోసిన్ పోసుకునో, విషంతాగో, ఉరివేసుకునో ఆత్మహత్యలకు పాల్పడ్డం గురించీ.....

రెండేళ్ళుగా ఆప్కోకు ముప్పై నాలుగు కోట్ల రూపాయల బకాయిలు చెల్లించకపోవడం గురించీ...

అన్నేళ్ళ నుంచి అందరు ఆత్మహత్యలు చేసుకుంటున్నా మనిషి పుట్టుక బతకడానికే కానీ అంతం చేసుకోడానికి కాదని భుజం తట్టి ధైర్యం చెప్పలేని హైటెక్ సర్కార్ గురించీ....అన్ని సంఘాల గురించీ...

ఎవరేమయిపోయినా ఏమీ పట్టని 'పని చేసే ప్రభుత్వ' ఘనత గురించీ....

పొగడరా.... నీ తల్లి .....!

6-4-20

వార్త దినపత్రిక